

శివరాజు సుబ్బలక్ష్మి

ఎటు చూసినా మంచుకొండలు, అగాధాల్లో పుట్టి శిఖరాలని తాకే పచ్చని చెట్లూ, అల్లు కున్న గుబుర్లూ. ఆ రంగులు చిత్రకారుడి కుంచెకి సృష్టినిచ్చేవి. కాని, ఆ వాతావరణంలో మత్తూ నిద్రా ఎక్కువ. ఎముకల్ని కొరికే చలి, చితచితలాడే వాన. మన ప్రాంతాల రేగడిమట్టి ఆక్కడినించి జరిగిందే అయి వుంటుంది. చిత్రమేమిటంటే అంతంత గుండ్రాళ్ళని ఆ మట్టి పట్టుకు ఆపుతోంది. అప్పుడు వర్షాలు అలిగి రాళ్ళనీ మట్టినీ విడ గొట్టి అల్పుల్ని ఆహుతిగా చేసి ఏమి ఎరగ నట్టు తుప్పర్లాపడి ఆ చెట్లకి శోభనిచ్చి, పచ్చ రంగుకీ నీరెండకీ పెళ్ళిచేసినట్టు పరిసరాలు కలకల్లాడుతాయి.

యాత్రలకి ఎందుకు వెడుతున్నారు? మానసిక చీకట్లని కడిగి విశాల ప్రకృతినీ విభిన్న మానవ సంచలనాన్ని చూసైనా మనస్సుని విశాలం చేసుకు అంతర్యాన్ని జ్యోతిలా వెలగనివ్వమని కొందరు ఘోష పెడితే, మరికొందరు అందమైన స్థలాలు, అంటే మంచి హోటళ్లూ, ఖరీదైన బట్టలూ, చుట్టూ వున్న జనం హోదాల్లో వున్నవారై వుంటే తృప్తి. వారి వారి పరివారం అంత స్తుకి తగ్గ అలంకారంతో వయ్యారం విడవ కుండా ఎత్తుపల్లాల నేలపైన కూడా ఎత్తు మడమజోళ్లు వేసుకునే రావాలన్న తాప త్రయం, వచ్చిన స్థలవిశేషంకన్నా, వారికి రాబోయే భవిష్యత్‌ని నెమరేసుకుంటూ వచ్చే ప్రమోషన్‌కి ఆనందంతో నిండిన మనస్సుని స్తిమితంగా నెమరు వేసుకుంటూ కునికేవారు కొందరు, ఏదో కొంత డబ్బు మిగుల్చుకొన్నాం. ఎవరో వెళ్తారు కనక మనం ఎందుకు వెళ్ళకూడదు అన్న బింకంతో బైలుదేరి, క్షణక్షణం కళ్ల వొత్తు కుంటూ ఇంటిపట్టు వొదిలినందుకు దిగులు పడ్డ బాపతు కొందరూ, జీవిత సగభాగం చీకటైన అయోమయంలో ఏం చెయ్యాలన్న తపనకి సమాధానం దొరక్క నిలకడలేని మనస్సుకి స్తిమితాన్ని వెతుక్కునే తాప త్రయంతో, పలకరిస్తే కళ్ళు చెమర్చే ఆర్తులు కొద్దిమంది కలిసి బయలుదేరిన బస్సు అది.

రుషీకేశ్‌లో బయలుదేరిన క్షణంనించే అంతా వొకటిగా వుండాలనుకున్నా, ఏ సీటు మనుషులు ఆ సీటుకే పరి మితమై యోగక్షేమాలు గుసగుసలూ కునికి పాటూ, వెక్కిరింపులూ. అది ఒక సమాజం, అందులో పెద్దా చిన్నా అన్న తలంపులూ ముందుసీటు వ్యక్తుల ఆధిక్యతా, ఆడంబ రాలూ; నడివయస్కులు వో తెగా, చిన్న వాళ్ళు వేరుగా, ముసలివాళ్ళు అంతా అటూ ఇటూ చేరుతూ కాస్సేపు వంటరిగా వుంటూ కబుర్లూ కాలక్షేపంతో, తిండివేళకి వో మఠా నికో సత్రానికో చేరి, ఆవురుమంటూ మూగి, అందరికీ చాలలేదన్న మూలుగులూ మూతి విరుపులూ, ఆకలికి అందినవి కొనుక్కునే నాగరీకుల సాహసం చూసి, అంతా అటే మొగ్గి ఎల్లాగో కొండకిచేరిన ఆ రాత్రి అను భూతి, ఆ ప్రాంతాన్ని భగవంతుడు చలిచీర కింద దాచి, ఏకాంతవాసంలో మౌనిగా మారి లక్ష్మిని సురక్షిత ప్రాంతాలకి పంపినట్లు తట్టింది. ఆ దేవికి భగవంతుని కలవాలి అన్న కోరిక అధికమైతే అల్పుల్లో నిల్చిన సిరి ఆడంబర రూపంలో యాత్రల కోరిక కలిగించి, తన కోరిక సాఫల్యం చేసుకు అల్పుల్ని అల్పులుగానే విడుస్తోంది చిత్రం. అంతా తర్పణాలు కలిసి విడుస్తారుట. అర్థం కాలేదు పార్వతికి, అసలు తనెందుకు వచ్చి నట్టూ? తను తెచ్చిన బంగారు మొహిరీలు రెండూ కళ్ళ కద్దుకుంది. వాటి పవిత్రతకి తగిన స్థానం, సురగలు కక్కుతూ సుడులు తిరిగే ఆ నది అలకనందకే అర్పించాలి. ఆ మంత్రాలు స్వచ్ఛంగా పలకలేని ఆ వ్యక్తి త్వంలో ఏ విధమైన ఘనతా కనపడటం లేదు. మరోమూల కూచున్న నల్లటిరూపంలో మెరిసే కమ్మలూ పట్టుబట్టా సంచీ పక్క నెట్టుకు, వెక్కుతూ చేతిగుడ్డతో కళ్ల వొత్తు కుంటోంది. మరో వయస్సుమళ్ళిన ఆవిడ వోదారుస్తోంది. అందర్నీ పోగేసిన పెద్దమనిషి మెల్లకన్ను తుడుచుకుంటూ "ఈ వచ్చిన వారిలో మొదటి కళత్రం లేకపోతే వెయ్యండి. తరవాత క్రమం ఆ పండిట్‌జీ చెపుతాడు" అని కూర్చున్నాడు. ఆయనకి అది లోపం అందుకే అది వూరుకున్నాడని గుసగుసలు.

ఓ వయస్సు మళ్ళిన అయ్యరు చివాల్న లేచి....నాకు యీ గుంపు సరం జాముఒద్దు ఎవరైనా వస్తేరండి నేను మీకు అన్నీ ఏర్పాటుచేస్తానని లేచి వెళ్ళిపోయాడు. పార్వతికి ఆలోచన పోయి అనుకరించింది. ఆ మనిషి అన్నట్టుగానే చేయించాడు. పార్వతి వెనక మరో నలుగురు రావటంతో



కొత్త పండిట్‌జీకి ముడుపు దొరికింది. మంత్రాలు వినటంలేదు పార్వతి. తన చేతిలోని మొహిరీలు తిప్పి చూసుకుంటోంది. తనకి అవి ఎల్లా సంక్రమించాయి. ముత్తవ్వ ఇచ్చిన సొత్తు. "అమ్మడూ, తాతపోయాక సూత్రాలు ఎవ్వరికి ఇవ్వ బుద్ధికాలేదే. అవి కరిగించి రహస్యంగా ఈ రూపంలో వంటినే మూల్లోపెట్టుకుతిరిగా. అపురూపమైన వస్తువే నాకు. నా పేరింటిదానివికదా ఏదైనా చేసుకో. కాని రూపు మాపకు" అంటూ వణికేకంఠంతో ఇవ్వటం గుర్తుకొచ్చింది. కాని వాటి విలువ చాలాకాలంగా గాద్రేజ్ బీరువా సొరుక్కే తెలుసు. దేనికీ వుపకరించని సొత్తులా పడి వుంది. అసలు తనెందుకు పుట్టిందీ, తనకైతే వాటి అవసరంలేదు. ఉండబట్టలేక ఆయనకి ఎందుకు చెప్పినట్టూ, ఆయన ఎప్పుడూ పట్టించుకోని మనిషి. ఆ పట్టేమిటి? అవి కరిగించి కంకణాలు చేయించమని. తనుకూడా మొగ్గడమేమిటి? అన్నీ క్షణాల మీద జరిగాయి.

కారు పోర్టికో విడిచి బజార్లో మధ్యగా నడుస్తోంది. ఎన్ని మైళ్ళు తిరిగిందో ఎప్పుడూ ఎవరినీ తాకలేదు. యజమాని మాటకీ చేతకీ తేడా లేదన్నట్లు బ్రేకులు వినయం విడవలేదు. ఆ చిరునవ్వు, ఆ హుందాతో కారు నడిపే ఆయనలో చాంచల్యాన్ని పార్వతి గ్రహించింది.

ఎదటి కారులో అర్ధ నగ్నంగావున్న అమ్మాయి చేతిలోని స్టీరింగ్‌మీద లగ్నమైన కళ్ళు మరి ఈ పాపిష్టి లోకాన్ని చూడలేదు. ఎదురుపడి వచ్చే బస్సూ, జీపూ ఏవి వేటిని గుద్దుకున్నాయో పార్వతికి అర్థంకాలేదు. తనకి తెలివి వచ్చింది. కాని ఆయన రూపం మరుగుపడి పక్షం రోజులైనట్లు, పనిమనిషి పట్టూ శోకాల్లో వెళ్ళబెట్టింది. తనకి ఏమైందీ. ఏడుపు రావటంలేదు. కళ్ళు మూసుకున్నా తెరుచుకున్నా అనుభూతి వొకటిగానే ఉంది. ఆయన చూపు, ఆ అమ్మాయి రూపు, మెల్లిగా మనస్సులోకి వెలిసిన బొమ్మల్లా ఎక్కాయి. మళ్ళీ మగత ఆవహించింది. డాక్టర్లూ సలహాలూ యెక్కువై వచ్చిన బంధువులకి పార్వతి స్థితిగతులపై మోజు పెరిగి మెరుపుల్లాంటి ప్రేమ పుట్టి ఎదటి వాళ్ళకి చురకలేస్తున్నాయి. రెండు తరహాల బంధువులు వుండబట్టే పార్వతిని పార్వతిగా వదిలారు. వాళ్ళల్లో వాళ్ళకి యెవరు ఆప్తులో తేల్చుకోలేక మెల్లిగా దొరికిన చిల్లర సామాన్లతో తృప్తిపడి వెళ్ళగలిగారు.

పార్వతికి బాధ తెలిసింది. భోరున ఏడ్చింది. తన మనిషిని ఏం చేశారు అన్న ప్రశ్న వచ్చింది. ఇల్లు అంతా తిరగేసింది. ఆఫీసు బల్ల బేతాళుడి రూపంలో కింద గదిలో దుమ్ము కొట్టుకు ఏడుస్తోంది. మెల్లిగా ఓ రోజు వెళ్ళింది. సొరుగులు తెరవలేక వెనక్కి తిరిగింది.

కొన్ని నెలలు గడిచినా భయం పెరుగుతోంది కాని తరగటంలేదు అని పట్టూ కాకిగోల చుట్టుపక్కలకి చేరింది. చిన్ననాటి స్నేహితురాలు సుశీల వచ్చింది. వోదార్పులోనే ఎన్నో చెపుతోంది.

"మీ ఆయనకో పార్సీ ఆమెతో..." అని వూరుకుంది. ఆ మాటకి పార్వతి చెవులు హోరు పెట్టాయి. మనస్సు వట్టిదను ఘోష పెట్టింది. కళ్ళు వర్షించాయి. కంఠం రోషంతో వూగిపోయింది. తల మాత్రం 'లేదు' అని అడ్డంగా వూగింది. పార్వతికి మళ్ళీ అచేతనం ఆవహించింది. మళ్ళీ తెలివి వొచ్చింది.

"హమ్మయ్య ఎరక్కపోయి అన్నానే తల్లీ" అంటూ సుశీల లెంపలేసుకు 'మరి నేను వూరికి వెడతాన'ని ప్రయాణం కట్టింది. పార్వతి వద్దని ప్రాధేయపడింది.

మెల్లిగా యిల్లు యిల్లంతా తిరుగుతున్నారు. దుమ్ములు దులుపుతున్నారు. సాయంత్రాల్లో కింద యింట్లో దీపాలేస్తున్నారు. ఆఫీసు కాయితాలు కొన్ని యింటికి తెచ్చారుట అవి యిప్పించమని గుమాస్తాలు తిరుగుతున్నారు. సుశీల ధైర్యం చేసి సొరుగులు తెరిచింది. పార్వతి వెక్కి వెక్కి ఏడ్చింది. గుమాస్తాకి కాయితాలకట్ట యిచ్చినట్లు వ్రాయించి పుచ్చుకుంది సుశీల. పార్వతి పచ్చరిబ్బను కట్టిన పెట్టె వళ్ళో పెట్టుకు ఏడుస్తోంది. సుశీల తీసుకు విప్పింది. పచ్చల్లా పొదిగిన కంకణాలు. దాని పక్కనే చిన్న సెంటుసీసా. ఆయనకి ప్రాణప్రదమైన ఆ సువాసన దుమ్ముకొట్టిన గదిని కూడా కడిగినంత హాయి నిచ్చింది, వాటికింద లేత నీలం వుల్లిపొర కాయితం లాంటి లెటరు పేడ్ కాయితం. అది ఆయన అపురూపంగా కొన్ని సందర్భాల్లోనే వాడతానని చెప్పటం గుర్తొచ్చింది. అది తనకే వ్రాసి పెట్టి ఉండాలి. తన పుట్టిన రోజుకి తప్పనిసరిగా ఖరీదైన బహుమానం యివ్వటం, తను ఎందుకని విసుక్కోవటం ఆయన దీనంగా నీతో యిదే చిక్కు, అవి యిచ్చి వస్తానని బయలుదేరటం, తను వద్దని రాద్ధాంతం అన్నీ ఆ నదిలోని నీటికదలికంత వేగంగా కదిలిపోతున్నాయి.



ఆ పండిట్ జీ 'హిరణ్యం' అని అరవటం వక్కచే అర్థమై, చేతినున్న వుంగరం తీసి ఆలోచనలేకుండా చేతిలో పెట్టేసింది. అయ్యో అది యిచ్చానేమిటి, అని తరవాత వాపోయింది. పండిట్ జీ చెప్పిన క్రమం చేసి ఓ బండమీదకూర్చుంది. మిగిలిన వాళ్ళు ఇంకా యేవో చేస్తున్నారు.

తెగిపోయిన గతం, వూహకి అతికించి చూసుకొంటోంది. ఆ వుత్తరం సుశీల చదివింది. దాని వికృతమైన వూహ మరీ వికృతంగా మారింది. 'చూశావా ఎంత కథానాయకుడో. ఎంత వాదించావు నాతోటి?' అంటూ ప్రతి అక్షరానికి, నాలుగేసి పర్యాయపదాలు సృష్టించి విశదపరుస్తూ ఆనందిస్తోంది:

పార్వతికి మనస్సులో మరో స్త్రీ పేరు మంటలా కాలుస్తోంది. కాని సుశీలలోని కనపడని తృప్తినీ, ఇంతేనా అన్న భావాన్నీ కాల్చి చంపాలనిపించింది. 'నా మొహం ఆయన మంచి నీకేం తెలుసూ. ఆవిడ ఏ కష్టంలో వుంటే సాయం చేస్తున్నారో' అని తప్పించేందుకు ప్రయత్నించింది. 'ఆహా కష్టమే. వాడిన పదాలు వింటావా : డార్లింగ్, బంగారు పిచ్చుకా, ప్రియమైన నా చిన్ని ఉడతా.'

'ఆగు' అని పార్వతి అరవగానే సుశీల కాయితం మడిచి పెట్టెలో పెట్టేసింది.

పార్వతి మొహం పక్కకి తిప్పుకు ఏడుస్తోంది. సుశీల నవ్వులో, లోకంలో పెళ్లి అనే పదంపైన అసహ్యం ప్రతిధ్వనించింది.

''ఈ అమ్మాయిల్ని చూస్తే జాలేస్తుంది. ప్రతిఆడదీ, ప్రతివాడూ తన్నుతప్ప మరొకర్ని కన్నెత్తి చూడకూడదనీ, అథవా చూడరనీ తమని తమరే మోసం చేసుకుంటారు. పెళ్ళయినవాడు ధారాళంగా చేస్తే ప్రియుడుగా మిగిలినవాడు రహస్యంగా సంచరిస్తాడు. ఇద్దరూ దొంగలే అయినా, నీకు కావల్సిందీ స్నేహమేగా. కూడా తిప్పుకున్నాడు. అది పూర్తి అయింది. ఇహ ఆయన కీర్తికి ఢోకా లేకండా మిగిలింది నీకు చెందుతుంది.


అది మన న్యాయశాస్త్రం సమకూర్చిన శాశ్వత సౌకర్యం. మరి ఎందుకు ఏడవటం? నువ్వు వూరుకోవే పార్వతీ'' అని, సినిమాల్లో విలన్‌లా తిరిగిపోతూ చెప్పి, మొద్దుమొహం కూర్చుని తన స్వగతం మొదలెట్టింది.

''నా బాధ చెపుతా విను. నీ భర్త—అదేమీ ఆయన, ఆ నీలం కాయితపు ఆవిడ ప్రియుడు, నా జీవితాన్ని నాశనం చేశాడు—అంటే నమ్ముతావా? అందుకే నాకు లోకంపైన అసహ్యం. కసి. పెళ్ళి పందిరంటే మంటలు నాలో ఎందుకు కలిగాయో ఎప్పుడైనా ఊహించావా! నీకెందుకు వొస్తుందిలే నా విషయం ఆలోచన. నీ ధీమా, కంటికి ఇంపైన నీ రూపం అన్నింటికీ గంగిరెద్దులా, తల వూపుతూ, అడ్డపుల్ల వెయ్యకపోవటమే గొప్ప సంస్కారంగా తలపోసుకు ఆకాశ సౌధంలో కూర్చున్నావు. కాని, నీ ఆరాధ్య దైవానికి కావల్సింది అది కాదుట. చురుకుతనం, తర్కించే స్వభావం, వేడి వూహల కులుకులు, సొగసులు ఆకట్టుకుంటాయి. స్వదస్తూరీతో నాకు వ్రాసిన దస్త్రాలంత ఉత్తరాల కట్టలు చదవగలవా? భరించగలవా? ముందు నిన్ను నువ్వు ప్రశ్నించుకో. చూపెడతాను. అవి చూసి అయినా నిన్ను నిన్నుగా చూసుకు కాలంతో సుఖపడతావని తెచ్చాను'' అంటూ సుశీల బల్లముందు కుర్చీలో కూలపడింది, లేచింది.

పార్వతికి ఆ స్థలంలో ఎవరు కూర్చున్నా చాలా కోపం వచ్చేది. అది ఆయనకి పరిమితమైనది. ఒహవేళ నిజంగా ఇది చెప్పిందే జరిగివుంటే తన ఆరాధనకి విలువ ఏమిటి? ఇది—దీన్ని—ఈ సుశీలని ప్రేమించాడా? తన దైవం. వద్దు వద్దు. ఆ యదార్థం తను తెలుసుకోగూడదు. ఇంకా ఆ కారులో కనపడ్డ గుబ్బం మొహం తెల్లపిల్లి కళ్ళూ మిలమిల్లాడినట్టు గుర్తు. అదైనా సహిస్తుంది కాని, ఈ కాకి రూపసిని ప్రేమించాడనటం అపచారం. అసలు ఇన్ని ప్రేమలా? ఈ జీవితం ఇంత చిన్నదని ఎప్పుడైనా అనిపించిందా? పాపం ఎంత హోష. ఏమైనాయి కోరికలు. ఈ అపరూపాలు వక్కటికూడా వెంబడించలేదే. ఇక్కడ కూర్చుని శపించకపోతే, కూడా వెంబడించి తేల్చుకోమని సుశీలకి చెప్పాలనిపించింది. కాని నల్ల మొహంలోని కోపం కాళికై కనిపించింది. కంటిపాపలు నిప్పుల్ని కక్కుతున్నాయి.

సుశీల మౌనంగా చాలాసేపు వుండలేదు. మళ్లీ మాటలు మొదలుపెట్టింది. ''ఇది అంతా ఎప్పుడు జరిగిందని ఆలోచిస్తున్నావు కదే? విను చెపుతా. మీ వూరుకి వచ్చినప్పుడల్లా మా ఇంటిదగ్గరే ఎక్కువ కాలక్షేపం చేసేవాడు. మా బామ్మకి

వల్లమందు ప్రీతిగా తెచ్చియిచ్చేవాడు. అంతే అవిడ ఆనందంతో మింగి చెంగుపరచేది. ఇంక ఆ మాటలూ ఈ మాటలూ చెప్పి నన్ను వాగించి వుబ్బించి, పట్నం చీరలూ రిబ్బన్లూ వద్దన్నా చుట్టబెట్టి, సెంటుబుడ్డీ పింబల్‌గా ఇస్తాటనుకుంటూ, నాకూ ఇచ్చాడు. దాని పరిమళంలో మత్తూ పిచ్చీ వుంది. లేకపోతే నేను ఎదిరించలేకపోవటం ఏమిటి" అని వెక్కి వెక్కి ఏడ్వటం చూస్తే పార్వతికి మనస్సూ బుర్రా మొద్దువారి మళ్ళీ మైకంతో గంటలు గడపటం కళ్ళముందు తిరుగుతున్నాయి. సుశీల చెప్పినట్టు తన మట్టిబుర్ర ఆకాశానికి అతుక్కుంది. తనకి బైముకి తిండా, కారులో పక్కన కూర్చోటం. అప్పుడప్పుడు పార్టీలూ, సినిమాలూ పండగలకి పట్టుచీరలూ, పెళ్ళిళ్ళకి నగలసెట్టు కొనుక్కుంటూ, అలంకరించుకు మురిసిపోవటం అంతే, ఆ తృప్తి ఇంకా మత్తులా పనిచేస్తోంది. ఇన్ని మాటలు విన్నా, తనకి ద్వేషం కలగటం లేదు. ఎందుకో అసలు తన మనిషి ఐనంత మాత్రాన మరొహర్ని ఎందుకు ప్రేమించకూడదూ? వొద్దు వొద్దు ఆ ఆలోచన తట్టుకునే శక్తిలేదు తనకి, అనిపించింది. వినటం లేదు, మనస్సు. పాపం ఇందరికి తన సర్వస్వాన్ని అర్పించి, తను ఏం బావుకున్నాడు. ఎవ్వరికీ చెప్పలేని ఏకాంతం మనిషిని మింగుతుంది. అదే పెరిగి కాలమై మింగుతుంది, కాని ఇవి అన్నీ గతంలో కలిశాక వూహించకూడదు. తను ఇక్కడికి వచ్చినందుకు డబ్బుతో సాధించగలిగింది జరిగింది. ఈ నదికి అర్పించాలి. వొద్దు వొద్దు అవ్వ పవిత్రబంధం పెరటిలో పాతిపెట్టడం మంచిది. ఓ తులసిదళంలోంచి అవ్వ మనసు మాట్లాడవొచ్చు. ఈ పచ్చల కంకణాలు విపిరితే మనస్సు తేలికై భారం తగ్గుతుందనుకుంది. సుశీల రొప్పుతూ వొచ్చి గ్రహించినట్టు చెయ్యి పట్టుకుంది. "మా పండిట్ జీ




టూకీగా చేయించేశాడు. మేము మాతామూర్తిని కూడా చూసివచ్చాము. నువ్వూ నీ అనుయాయులూ గొంగళ్ళలా పడివున్నారు వుండండి" అంటూ కంకణాలు లాక్కు వురికినట్టు నడిచింది. పార్వతికి సుశీలమీద కోపం వచ్చినా, అలవాటైన శాంతం నోరు నొక్కింది. ఆ పరిసరాలు తర్పణాలకి అంకితమైనట్టే తనూ మౌనానికి మాటిచ్చింది.

మెల్లిగా మామ్మగారు పిలుస్తున్నారు. ఆమెకి ఆకలీ, వార్ధక్యం, చలి, ఇన్ని బాధల్ని మొయ్యాలి. ఆముదతల శరీరం పాపం నడుం వొంచుకు ఒస్తోంది. తను కర్రపట్టుకు నడిపిస్తోంది. పెద్ద బండల మధ్యకి దారి వచ్చి పక్కకి తిరిగింది. అక్కడ మనుష్యులు లేరు. కాని కిలకిలమనే నవ్వు. తిరిగి చూసింది. శాస్త్రం కోసం తర్కించి విడిగా జరిపించిన ఆ మనిషే. యింకా చందనంవుంది. ఆ లుంగీ మనిషి బండపైనించి కిందకి జరుగుతున్నాడు.

ఆ వెనక తొంగిచూసే పిల్ల. అక్కడి మొద్దుబట్టల్లో కూడా యవ్వనం తొంగిచూస్తోంది. ఆ చలిలో మెరిసే ఆమె రంగుకి యెంత విలువో. ఏదో సైగచేస్తోంది. అతను తిరిగి తిరిగి చూస్తూ ముందుకి నడిచాడు. ఏమిటి జరిగింది? వాళ్ళు యాత్రకి ఎందుకు రావటం? ప్రకృతిని కమ్మని కలల్లో వూహించుకుంటూ వేడిరక్తం అనుభవాల్లో ములిగిపోక అనుకుంది.

అంతా తిరుగుప్రయాణానికి హడావిడి పడుతున్నారు. కొండలు దొర్లి దారికి అడ్డుపడ్డాయట. అంతా గోలగా తిరుగుముఖం పట్టారు. సుశీల ఏడ్చేస్తోంది.

నీ కోసం వచ్చాను. లేకపోతే నేను రాకేం, అని చెప్పుతోంది. బస్సు కదిలింది. ఆగింది. లోయలోకి దొర్లింది. చెట్లూ గుట్టలూ పట్టుకున్నాయి. పొద్దుట చూసిన లుంగీమనిషి రక్తం వాగులోని నీరు కలుపుకుంటూ పోతోంది. బండకి కొట్టుకు తల పగిలించిట. అపరాధం చేశాడా? పూర్ణత్వం పొందాడా? ఎవరు చెప్పగలరు? సుశీల నోటికి వొచ్చినట్లు మగవాళ్ళని తిడుతోంది. కొందరు కళ్ళు వొత్తుకున్నారు. కొందరు పెదిమలు విరిచారు. అతనికి బాహ్యంలో ఎవరు మిగిలారు? అనుభవం అంతేనా? లేదు. భార్యాపిల్లలు అని మనస్సు చెప్పింది. మొహిరీలు అతని పక్కన మెరిసేయి.

———